# పెన్నేటి కతలు


## వానొచ్చె...

"ఈ పొద్దు వాన గ్యారంటు" అని అర్సినాడు 1 నాగిరెడ్డి. పొద్దున్నే వాళ్ళ మిద్దెమీద నిలబడుకోని, పెన్నపైన ఆకాశంలో పెరిగి పెరిగి వచ్చే మోడం[2] దిక్కు సూస్తా.

"ఏంరో అబ్బి, ఏందంత నమ్మకం?" అని యీదిలో ప్యాడగంప నెత్తిన బెట్టుకోని నిలబడుకోనున్న సంజన్న పైకి సూస్తా అడిగినాడు. "ఏందంత నమ్మకం?" అని సంజన్న నాగిరెడ్డిని అడిగినాడు గానీ వాటం సూస్తే వానొచ్చేతట్టే వుండాదని లోలోపల తానూ సంబరపడ్తా, ఆశపడ్తానే వుండాడు. అందుకే నాగిరెడ్డిని నగుతా నగుతా అడిగినాడు.

"అవు సిన్నాయనా ఈ రోజు గ్యారంటు, ఈ రోజు వానేవుడు కళ్ళు తెర్సేది కాయం" అన్నాడు మళ్ళా నాగిరెడ్డి. ఈసారి సంజన్న గట్టిగానే నగినాడు. నగుతానే నెత్తిమీద ప్యాడ గంపతోనే మోడం నడిసే దిక్కు సూసినాడు. కల్లూరు మూల్నె పుట్టిన మోడం పెరిగి పెరిగి ఇటు రేగళ్ళపల్లె, తాళ్ళమార్పురం మీదుగా పెన్న అవతలి దిక్కుకూ అటు సంబటూరు కోగటం మీదగా పొలిమేర దిక్కుకూ నడ్సడం సూసి, ముశాలసాట్నె[3] నగుకుంటా కుశాలగ ప్యాడగంప ఎత్తుకోని దిబ్బకు గునగున పరుగెత్తినాడు.

మిద్దె మీద నిలబడుకోని మోడం దిక్కు సూస్తా వుండేది నాగిరెడ్డొక్కడే అనుకొంటివా...ఓయమ్మ! అట్ట సూడుమల్ల మిద్దెలమీద ఎంతమంది నిలబడుకోని ఎగజూస్తావుండారో! గయిన[4] కాడగాని గోళ్ళు మాడి[5]పైకెక్కి ఇంటెల్లిపాదీ సూస్తా వుండారా, వాళ్ళ కాపక్కన బొగ్గరపోళ్ళు, ఈ పక్కన ఇరంకుంట్లోళ్ళు, యెనకాల ఓరమోళ్ళు...ఇంతెందుకబ్బా మిద్దెలున్నోళ్ళంతా ఎక్కి సూస్తానే వుండారు. ఇంగ పిల్లల కుశాలయితే సెప్పేపన్లా! దగ్గుతో, ఆయాసంతో రొప్పుతా వుండే కరెడ్ల నారయ్య గూడా మెల్లంగా తాపలు[6] దిగొచ్చి మోడం దిక్కు సూసి...ఎన్నేండ్లనుంచో మర్సిపోయిన నగునగబట్టె. రాతిరి తేలుకుట్టే,



దాటిపోతదేమోనేట్లు బయపడిచ్చిన బాలమ్మ గూడా కుంటుకుంటా బయటికొచ్చి పంచలో కూచ్చోని పైకి సూస్తాంది.

"సల్లగాలి మళ్ళిందబ్బీ, వచ్చే తట్టేవుంది" అంటూ నాగిరెడ్డి పక్కన అబ్బిరెడ్డి, ఆయన పెండ్లాం నారమ్మా, బిడ్డ ఎంగటమ్మా వచ్చి నిలబడినారు. నిజమే...సల్లగాలి మళ్ళింది, వాన సారకలు దిగబడి వానాసన కూడా వస్తాంది. "నిన్న గుడి సంపులో సేద్యం సేస్తాంటే ఏం ఉబ్బరపు ఎండ బెట్టిందని! అప్పుడే అనుకున్నా రేపో మన్నాడో వాన తప్పదని" అన్నాడు అబ్బిరెడ్డి. "అవు" అన్నాడు నాగిరెడ్డి. ఆ 'అవు' ఉబ్బరపు ఎండకో, వానకో తెల్దుమల్ల.

"రొం[ఒ]దోజుల్లో వాన రాకుంటే సెనిక్కాయ పైరు బోడ్డం[7] సిసి పాయాల్సిందేనబ్బీ" అన్నాడు అబ్బిరెడ్డి. దీనిగ్గూడా 'అవు' అన్నాడు నాగిరెడ్డి. "ఏట్లో నడుంలోతు సెలమ[8] తీస్తేగానీ నీళ్ళు రావడంలా" అంది నారమ్మ. దీనికి మాత్తరం 'అవు సిన్నీ' అన్నాడబ్బా నాగిరెడ్డి. ఇంతలో "మా...! నా నెత్తిన సినుకే" అని కెవ్వున అర్సింది ఎంగటమ్మ. "ఓస్నీ...! వులిక్కిపడ్తిగదే" అని "సినుగ్గదేమోలే" అంది నారమ్మ, వానొస్తాదని నమ్మనట్టు.

వాన వస్తాది వస్తాదనుకొంటేరాదని, రాదనుకొంటే వస్తాదనీ, వాళ్ళకొక నమ్మకం. నమ్మకమంటే పూరా నమ్మకమనీగాదు, అట్టుంటేనే మంచిదనుకొంటారు. ఎందుకంటే, ఎన్నో లచ్చలసార్లు వానవచ్చె అనుకొని, ఉత్తదైపోతే నిరాసపడిపోయినోళ్ళుగదా! అందుకని, అట్టా ఆశ పెట్టుకోకపోతే వానవచ్చెనా మంచిదే, అప్పుడే సంబరపడొచ్చు. లేదా, ఎట్టాగూ రాదనుకొన్నదేగదా అని వూరుకోవచ్చు. అది మాత్తరం సులువా అంటే కాదు... అయితే ఏంజేయాల? ఆశపెట్టుకోడానికైనా వాళ్ళకు అవుకాశం వుండొద్దా? ఊర్కే ఊపిరి బుడ్డ మాదిరి ఉబికిపోతే అవతల[9]... టొప్పని పగిలిపోవాల!

"మో...! సినుగ్గాదంటావ్, సూడుసూడే నాయిత్మెన సూడు, పక్క సెవుకాడసూడు" అంది ఎంగటమ్మ, వాళ్ళమ్మ సెయిపట్టి గుంజి. ఆ గుంజిన కూతురు సేతిమీదా, కూతురు సేతిలో వున్న తల్లి ముంజేతిమీదా మళ్ళా రెండు

సినుకులు పన్నాయి. ఆ ఎంటనే టపాటపామని మొదలై, టపటపమని ఇస్పీడెక్కింది. నాగిరెడ్డీ, అబ్బిరెడ్డీ నారమ్మా అందరూ ఒకరి మొగం ఒకరు నగుతా సూసుకొన్నారు. మోడం కూడా నగుతాన్నట్టు తలుక్కున మెర్సింది. ఎట్టా వుండారని వాళ్ళను పలకరిచ్చినట్టు మెరుపు ఎంటనే బడబడా ఉరిమింది. ఆ ఉరుము ఇంటానే అందరికీ లోపల్నించీ సంతోసం పైకి తన్నుకొచ్చింది. వాళ్ళ సంతోసం మాదిరే మట్టి వాసన గుమ్మున పైకెగజిమ్మింది.

ఈదుల్లో మోరలు పైకెత్తి వానాసన పీల్చుకుంటున్న కుక్కలు, సెట్లల్లో రెక్కలు యిదిలిచ్చుకొంటున్న పిట్టలు... ఊరూ, ఏరూ, ఎండిపోతున్న పైరు అన్నీ "రా... రా, ర్రా... ర్రా" అని వానను పిలుస్తున్నట్టున్నాయి. ఇప్పటికి ఏటిని ముంచేసింది వాన. "ఏరు కనపల్లా... ఏరు కనపల్లా!" అని ఎగిరెగిరి అరుస్తాంది ఎంగటమ్మ. నిజానికి ఇప్పుడు వానొచ్చినా వాళ్ళు పూరాగా బాగుపడేదేం లేదు. ఇప్పటికే మూడు బాగాలు పైరు ఎండిపాయె. అయితే ఇప్పుడొచ్చినా, గొడ్లకింతమేత, ఇత్తనాల కర్సు తీరతాది. దీనికంటే ముక్కెం 10 వానెప్పుడొచ్చినా వానే! వాన రాక పన్న కట్టాలే తప్ప వానొచ్చి పన్న కట్టాలట్టే తెల్దు వాళ్ళకు.

ఈపాటికి వానకోసం సూస్తాన్న వాళ్ళంతా తడ్సిపోయిరి. "రాబ్బి. ఇంగ బయం లేదు రా, వానొచ్చినట్టే, పోదాం పా తడ్సిపోతిమి" అని అబ్బిరెడ్డీ, నారమ్మ బంగపోయినా॥. నాగిరెడ్డి అట్నే నిలబడుకోని "మీరు పొండి" అనె! పైన్నించీ కిందికి నీళ్ళు కారిపోతున్నా కండ్లు మూసుకోని నిలబన్న నాగిరెడ్డికి వానవడి తగ్గినట్టు తెల్సి... కండ్లిప్పితే అప్పటికే అల్సిపోయినట్టు ఇచ్చిపోతాంది! వాన ఇంగా పెరుగుతాదని అనుకొంటా యిండ్లలో వున్నోళ్ళు మళ్ళా బయటికొచ్చినారు.

ఇప్పటికి రొంత 12 ముందు కనిపించిన మనుసులకూ, ఇప్పుడు కనిపించే మనుసులకూ ఎంత తేడా వుందో కండ్లతో సూసిన వాళ్ళకు తప్ప ఇతర్లకు తెల్దు. ఇప్పుడెవురూ ఏం మాట్లాల్లేదు. ఒకరి మొగంలోకి ఒకరు సూసుకోవాలన్నా ఇట్టం లేనట్టుండిపోయినారు. పైకి సూస్తే... మోడం ఏదో మోసమో, దొంగతనమో సేసినట్టు పారిపోతాంది పక్క పక్కలకు. ఇప్పుడు గూడా అక్కడెక్కడో మెర్సింది, ఉరిమింది. అయితే, ఆ మెరుపు ఆ ఉరుము ఇంతకు ముందు వాళ్ళన్జూసి నగి, పలకరిచ్చినట్టు లేకుండా... ఎగతాళి సేస్తున్నట్టుగా, "మీ బతుకింతే" అన్నట్టుగుంది!

— రామకృష్ణారెడ్డి

1. కేకేసినాడు 2. మేఘం 3. మిాసాల
4. గవిని 5. మేడ్ 6. మెట్లు
7. వ్యవసాయపు పనిముట్లు
8. నీళ్ళ కోసం తవ్వే చిన్న గుంట
9 ఆ తర్వాత 10 ముఖ్యం
11 బ్రతిమాలినా 12 కొంచెం

## సాక్షాత్కరణ

నన్ను నేను స్మరించుకుంటున్నాను
నన్ను నేను నగ్నదర్శనం చేస్తున్నాను
జీవితం సంక్షుభిత వ్యధాభరిత విషాద కావ్యంగానే
సాక్షాత్కరిస్తోంది!
నాంది ప్రస్తావనలు లేనేలేవు
సుఖాంతాలు కానే కావు
అన్నీ అమంగళ మంత్ర శ్లోకాలే!
విదూషకుడు తలక్రిందులుగ తపస్సుకు ఉపక్రమించాడు
నాయక ప్రతి నాయకులు ద్వంద్వ యుద్ధానికి తలపడుతున్నారు!
అన్నీ నేనే—
నన్ను నేను దహించుకుంటాను
నన్ను నేను వంచించుకుంటాను
నన్ను నేను ఉద్ధరించుకుంటాను
నాకై నేను యుద్ధ బీభత్సాన్ని సృష్టిస్తాను
తత్క్షణం క్షత గాత్రుడనైనా
మరుక్షణం మొక్కవోని ధైర్యంతో నిలుస్తాను
గాయాల పూదోటలో విశ్రమిస్తాను
శారవ నరకాల్ని మునివంటి కింద బిగిస్తాను!
నా ఆశా కుసుమాలు—
ఖడ్గధారల మధ్య తునాతునకలై క్షితిజరేఖపై రాల్తాయి
మౌనముద్రలు కంటక పరీవృతమైన మార్గాంతరాలు పడతాయి
కాల స్వప్నాలు స్వర్ణమంజీరాలై అగాధంలోకి ప్రవహిస్తాయి.
ముఖ వృక్షాల మీద నీలి నీడలు పూడల్లా పరుచుకుంటాయి
వృక్ష శాఖలు అగ్ని శిఖల్ని దిక్కులకు వెదజల్లుతాయి



మేఘాలంకృత ధూమకేతులు నాల్కలు సాచి విశ్వాంతరాళాన్ని
వ్యాపిస్తాయి—
అడుగడుగునా అవాంతరాల్ని అధఃకరించాలి!
కళ్ళ ముందే—
మధుకలశం ఎండిపోయింది
స్వప్న శకలం జారిపోయింది
మాయపరదాలు అదృశ్యమైపోయాయి
విక్రమార్కుడిలా కలల శవాన్ని మోస్తున్నాను
భేతాళ హృదయం చిక్కుముడులతో వేధిస్తోంది
తల వేయి వ్రయ్యలవుతుందని బెదిరిస్తోంది
ముడికి ముడి సమాధానం కాదు కదా!
ఆలోచన అన్వేషణకు దారి కదా!
జీవితమంత సత్యావిష్కరణ సాధ్యమా!
శవం అదృశ్యమైపోయి మళ్ళీ చెట్టెక్కుతుంది!
నేను బీరువులా విష్క్రమించలేను
మరీచికల వెంట పరుగిడమాలేను
రంగస్థలం మీద—
సన్నివేశాలు మారిపోతున్నాయి
జీవితం సంక్షుభిత వ్యధాభరిత విషాద కావ్యంగానే
సాక్షాత్కరిస్తోంది!

— జూపల్లి ప్రేమ్‌చంద్